రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# వాడిని ఊళ్లోకి రానీయం



## చందాలేసుకొని అయినా లేపేస్తాం

**"వాడ్ని మళ్లీ ఊళ్లోకి రానివ్వం.. ఒకవేళ వస్తే వాడి సంగతి మేమే తేలుస్తాం.. అవసరమైతే ఊరంతా చందాలు వేసుకొని అయినా ఆ నరరూప రాక్షసుడిని అంతం చేస్తాం!" ఇదీ ఆరుగురిని పొట్టనబెట్టుకున్న కిరాతకుడు రాజ్ కుమార్‌పై దైవాలగూడ గ్రామస్థులు వ్యక్తం చేస్తున్న నరనరాన ప్రవహిస్తున్న క్రోధం. కన్నప్రేమను, కట్టుకున్న బంధాన్ని మంటగలిపి, కళ్లెదుటే ఇద్దరు పసికందులను, భార్యను కత్తితో పొడిచి చంపిన ఆ సైకో ఉన్మాదానికి ఊరంతా అట్టుడుకుతోంది. చట్టం ఇచ్చే శిక్ష కంటే ముందే, ఆ రాక్షసుడికి తామే బుద్ధి చెప్తామంటూ జనం లాఠీలు, కత్తులు పట్టినంత పని చేస్తున్నారు. రెండు దశాబ్దాలుగా ప్రశాంతంగా ఉన్న షాబాద్‌ను రక్తాసిక్తం చేసిన ఈ నరహంతకుడిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదంటూ దైవాలగూడ గ్రామస్థులు పగతో రగిలిపోతున్నారు.**

### నరరూప రాక్షసుడు రాజ్ కుమార్‌పై దైవాలగూడ గ్రామస్థుల తీవ్ర ఆగ్రహం..

### ఆరుగురిని పొట్టనబెట్టుకున్న ఉన్మాదికి ఊరిలోనే శిక్ష విధిస్తామంటూ హెచ్చరికలు

### నరరూప రాక్షసుడిపై ఊరంతా వ్యతిరేకత..

### చట్టం కంటే ముందే బుద్ధి చెప్తామంటూ గ్రామస్థుల హెచ్చరికలు

**చేవెళ్ల, జూలై 12 ప్రభాతవార్త:** పరాయి బంధం కోసం పేగు బంధాన్నే తెంచేస్తున్న ఉన్మాదుల వల్ల సమాజంలో మానవ సంబంధాలనే మాటే మంటగలిసి పోతోంది. ఏకాకి జీవితం నాది అంటూ కుటుంబ బంధాల్లోని మాధుర్యానికి నోచుకోక కొందరు అలమటిస్తుంటే, పరాయి మనుషుల మోజులో పడి కుటుంబాల్ని సొంత చేతులతోనే సర్వనాశనం చేసుకునేవాళ్లు మరికొందరు అవుతున్నారు. చేవెళ్ల, షాబాద్ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన సంఘటనలను పరిశీలిస్తే డబ్బు, వివాహేతర సంబంధాలు, జూదం మరియు మద్యం మత్తులే ప్రధాన కారణమవుతున్నాయి. క్షణికావేశంలో దారుణాలకు ఒడిగట్టి జైలుపాలవుతూ, కన్నతండ్రిని, కట్టుకున్న భార్యను, కన్నతల్లిని, కన్నపిల్లలను హతమారుస్తూ అనుబంధాలను దహనం చేస్తున్నారు. ఒకప్పుడు షాబాద్ అంటేనే రక్తసిక్త చరిత్రకు అద్దాగా ఉండేది. 1988లో సంచలనం సృష్టించిన టీడీపీ నేత పట్నం రాజేందర్‌రెడ్డి దారుణ హత్య, 1990లో శ్రీపతిరెడ్డి హత్య, 1992లో అంతారం వద్ద న్యాయవాది జగన్ హత్య, 1995లో మాజీ ఎంపీపీ కిష్టయ్య హత్య వంటి వరుస ప్రతీకార దాడులతో అప్పట్లో ఈ ప్రాంతం రక్తసిక్తమైంది. అయితే, గత రెండు దశాబ్దాలుగా ఇక్కడ ప్రశాంత వాతావరణమే కొనసాగుతూ, నేరాలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పుడిప్పుడే జనం ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో, ఓ ఉన్మాది ఆరుగురిని పొట్టన పెట్టుకోవడం మళ్లీ రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.

పెళ్లి చేసుకొని ఇద్దరు పిల్లలున్న ఒక వ్యక్తి, ఓ బాలికను ప్రేమించమని వేధించాడు. ఆ బాలిక పోలీసులను ఆశ్రయించడంతో, బెయిల్ మీద బయటకు వచ్చిన ఆ ప్రేమోన్మాది సదరు బాలికను, అడ్డుకోబోయిన ఆమె తల్లిని, నాయనమ్మను దారుణంగా హతమార్చాడు. అంతటితో ఆగకుండా, తనను ప్రశ్నించినందుకు కట్టుకున్న భార్యను, కన్నప్రేమను మరిచి నాలుగేళ్ల కొడుకును, రెండేళ్ల పసికందును సైతం హతమార్చడం అతడి సైకోతనానికి పరాకాష్టగా మారింది. ఈ ఉన్మాదిని ఎన్‌కౌంటర్ చేయాలని స్థానికులు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘోరానికి ఒడిగట్టిన నిందితుడు రాజ్ కుమార్ గతంలో పార్వతి సరిత అనే టీచర్ దగ్గరకు ట్యూషన్ కోసం వెళ్లేవాడు. తనకంటే ఆరు సంవత్సరాలు పెద్దదైన సరితను ప్రేమిస్తున్నానని వేధించి, 2018లో పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నాడు. మొదట్లో డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగించిన రాజ్ కుమార్, ఆ తర్వాత ఆన్లైన్ గేమింగ్, జూదం, బెట్టింగ్లు వంటి వ్యసనాలకు బానిసయ్యాడు. తీవ్రంగా అప్పులపాలు కావడంతో తల్లిదండ్రులు పొలం అమ్మి అప్పులు తీర్చినా అతని ప్రవర్తన మారలేదు. రోజు రోజుకూ జల్సాలు ఎక్కువవడమే కాకుండా భార్యను తీవ్రంగా వేధించేవాడు. దాదాపు రెండు కోట్లకు పైగా అప్పులు చేయడంతో భార్యాభర్తల మధ్య వివాదం ముదిరింది. సరిత పెద్దల ముందు పంచాయితీ పెట్టి విడాకులు ఇవ్వాలని కోరడంతో కక్ష పెంచుకున్న రాజ్ కుమార్, శుక్రవారం రాత్రి భార్య పిల్లలను కత్తితో పొడిచి చంపేశాడు. ఈ నరరూప రాక్షసుడిని ఊళ్లోకి రానివ్వబోమని, తామే చందాలు వేసుకొని అయినా వాడిని అంతం చేస్తామని దైవాలగూడ గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నిందితుడిపై కఠిన చర్యలు ఉంటాయ్

**ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి**

**షాబాద్, జులై 12, ప్రభాతవార్త :** షాబాద్‌లో రాజ్ కుమార్ హత్యాకాండ బాధితులను శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పరామర్శించి బాధితుల ఇంటి వద్ద మృతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉన్మాది రాజ్ కుమార్ కిరాతక చర్యపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తీవ్రంగా ఖండించారు. సైకోగా అభం శుభం తెలియని పిల్లలు, వృద్ధులను కిరాతకంగా హతమార్చడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధై ర్యం చెప్పారు. బాధిత కుటుంబంలోని మేఘనకు ప్రభు త్వం అండగా నిలుస్తుందని అన్నారు. రూ. 5 లక్షల పరిహారం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు అంశం కలెక్టర్ నారాయణ రెడ్డి ప్రకటించారు. బాధిత కుటుంబంలోని దివ్యాంగురాలు మేఘనను చూసి చెలించి పోయారు. ఆమెకు వైద్యం, పునరావాసం కోసం కలెక్టర్ నారాయణ రెడ్డిను ప్రభుత్వం ఆదేశించిందన్నారు. సీఐ,ఎస్ఐలను సస్పెండ్ చేశారని వివరించారు. నిందితులపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి పామెన భీం భరత్, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, నాయకులు జడల రాజేందర్ గౌడ్, తమ్మలి రవిందర్, రామస్వామి, మాణిక్ రెడ్డి, అస్మత్ పాషా, ఉప సర్పంచ్ దండు రాహుల్ ఆయనతో ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మహేందర్ రెడ్డి

### చిత్తశుద్ధి నిరూపించుకోవాలి : ఎమ్మెల్యే శంకర్

**షాబాద్, జులై 12, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో జరిగిన ఆరుగురు హత్యల ఘటనలో బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిందితుడి దారుణాలకు అధికారుల నిరక్ష్యమే కారణమైందని ఆరోపించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో నేరస్తులకు వత్తాసు పలకకుండా, కఠి నంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వాల నిరక్ష్యం వల్లే ఇటువంటి దారుణ ఘటనలు జరుగు తున్నాయని, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చట్టాలను మరింత బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలంటే హంతకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ కేసులో బాధ్యులైన ప్రతి అధికారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోక్సో కేసులో నిందితుడికి అనుకూలంగా తక్కువ శిక్ష పడేలా సెక్షన్లు నమోదు చేశా రంటూ పోలీసులపై విమర్శలు చేశారు.

గతంలో బాధిత కుటుంబ పెద్ద హత్యకు కూడా ఇదే నిందితుడు కారణమని ఆరోపించారు. కుటుంబ సభ్యుడు తప్పు చేసిన ప్పుడు అతడిని అడ్డుకోవాల్సిన బాధ్యత కుటుం బానిదేనని, ఈ ఘటనలో నిందితుడి కుటుంబ సభ్యుల పాత్రపై కూడా విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వడమే సరిపోదని, ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి బాధి తులకు పూర్తి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్య క్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.



రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ఉన్మాదిని ఉరి తీయాలి : మానవ హక్కుల ఫెడరేషన్ నేత హరిలాల్ డిమాండ్** >>4

**పోలీసులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదు**

**కార్మిక సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్** >>4

**ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ దారుణం** >>3

**పోక్సో కేసు నమోదై 55 రోజులు గడిచినా నిందితుడిని ఎందుకు అరెస్టు చేయలేదు : మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**



**బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలి: సిపిఐ**

>>3 **పోలీసుల నిరక్ష్యమే ప్రాణాలు తీసింది**

# అడవి జంతువును వేటాడిన గ్యాంగ్ అరెస్ట్

**నిఘా పెట్టి పట్టుకున్న శామీర్‌పేట పోలీసులు**

**రైఫిల్, ఎయిర్‌గన్, మందు గుండు సామాగ్రి స్వాధీనం**

**శామీర్‌పేట, జులై 12, ప్రభాతవార్త :** రక్షిత జాతికి చెందిన అడవి జంతువు నీల్‌గాయ్ (బ్లూబుల్)ను వేటాడిన ముగ్గురు సభ్యుల గ్యాంగ్‌ను శామీర్‌పేట పోలీసులు, మల్కాజ్‌గిరి-11 (కంటోన్మెంట్) ఎస్‌ఓటి పోలీసులు (బృందం) సంయుక్తంగా నిఘా పెట్టి పట్టుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటల సమయంలో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంతాయిపల్లి బిట్స్ చౌరస్తా వద్ద శామీర్‌పేట పోలీసులు,ఎస్ఓటి పోలీసుల టీమ్స్ సంయుక్తంగా నిఘా పెట్టి ఆ ముగ్గురు గ్యాంగ్ ముఠాను పట్టుకున్నారు. వారి నుంచి రైఫిల్, ఎయిర్‌గన్, 88రౌండ్ల మందు గుండు సామాగ్రిని, ఆయుధ లైసెన్స్ బుక్, అడవి జంతువు నీల్‌గాయ్-(బ్లూబుల్)ను చంపిన తరువాత చర్మంను తొలగించి సుమారు 70కిలోల నీలగాయ్ మాంసంను, ఆ జంతువు కోతకు ఉపయోగించిన ఒక కత్తిని, ఒక వాహనం బుల్లోరో, మొబైల్ ఫోన్లు 2 వారు వాడిన వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఈ ముఠాను పట్టుకున్న విషయంపై అదనపు డిసిపి రామ్‌కుమార్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి జోన్ అదనపు డిసిపి రామ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు చెందిన వేముల సునీల్ సల్మాన్‌రాజ్ (అలియాస్) సునీల్(56), వేముల అఖిల్ (29) తండ్రి,కొడుకు,, కట్టా ఆదినారాయణ (46) మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్న స్వస్థలం ఎపి కృష్ణాజిల్లా అని ఈ ముగ్గురు ముఠాను పట్టుకున్నట్లు తెలిపారు. అయితే నిందితులు వేముల సునీల్ సల్మాన్‌రాజ్ అలియాస్ సునీల్, నిఖిల్‌లు తండ్రి కొడుకులు, అయితే వీరు అఖిల భారత చెల్లుబాటుతో స్వీయ రక్షణ కోసం 28/హోమ్/2021నెంబరు గల ఆయుధ లైసెన్సును కల్గి ఉన్నట్లు తెలిపారు. నిందితులు తమ ఎరుపు రంగు గల మహీంద్రా బొలోరో వాహనం నెంబరు టిజి08డి0433 లో అదిలాబాద్ ప్రాంతానికి వెళ్లినట్లు తెలిపారు. అక్కడ సునీల్ టెలిస్కోప్ అమర్చినతన లైసెన్సు పొందిన ఎన్‌పిబి 30-06 ఎస్‌బి రైఫిల్‌ను ఉపయోగించి అడవి ప్రాంతంలో ఒక నీల్‌గాయ్ జంతువును వేటాడినట్లు ఆరోపణలు ఉన్నట్లు తెలిపారు. అయితే ఆ జంతువును చంపిన తరువాత సునీల్ కొడుకు అఖిల్, పనివాడు ఆదినారాయణతో కలిసి నీల్‌గాయ్ చర్మాన్ని ఒలిచి, మాంసాన్ని ముక్కలుగా కోసం జవహర్‌నగర్ సమీపంలోని యాప్రాల్‌లో ఉన్న తమ ఇంటికి బయలు దేరినట్లు తెలిపారు. ఈ విషయంపై ముందుగానే పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందటంతో శామీర్‌పేట పోలీసులు, ఎస్ఓటి మల్కాజ్‌గిరి పోలీసులు టీమ్స్ ఆ రెండు బృందాలు శామీర్‌పేట మండలం అంతాయిపల్లి బిట్స్ చౌరస్తా వద్ద ఒక వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురు నిందితులను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పంచుల సమక్షంలో వారి వద్ద ఉన్న ఆయుధం, నీల్‌గాయ్ మాంసంను, నేరానికి ఉపయోగించిన ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే రక్షిత వన్యప్రాణులను అక్రమంగా వేటాడటం ఒక తీవ్రమైన నేరం, ఇదీ వన్యప్రాణులకు, పర్యావరణానికి పూడ్చలేని నష్టాన్ని కల్గిస్తుందన్నారు. వన్య ప్రాణుల నేరాలలో పాల్గొన్న వ్యక్తులకు కఠిన చర్యలు తీసుకోవటానికి వన్య ప్రాణుల సంరక్షణ చట్టాలను సమర్ధవంతంగా అమలు చేయటానికి మల్కాజ్‌గిరి పోలీసులు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. లైసెన్స్ కల్గి ఉన్నా ఆయుధాన్ని అక్రమంగా ఉపయోగించటం ఆయుధాల చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించినట్లే అవుతుందన్నారు. ..శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో వన్య ప్రాణుల సంరక్షణ చట్టం 1972లోని సెక్షన్9, సెక్షన్ 51, ఆయుధాల చట్టంలోని సెక్షన్ 30కింద కేసు నమోదు చేసినట్లు వారిని అరెస్ట్ చేసినట్లు ధర్యాప్తు కొనసాగుతుందని అన్నారు. .. ప్రజలు వేట హత్యలు, ఉచ్చులతో పట్టుకోవటం వంటి వాటికి దూరంగా ఉండాలని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషన్‌రేట్ నుంచి కోరటం జరుగుతుందన్నారు. రక్షిత వన్యప్రాణిని గాని లేదా శరీర భాగాలను గాని కల్గి ఉండటం లేదా రవాణా చేయటం అనేది 1972వన్య ప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం శిక్షార్హమైన తీవ్రమైన నేరమని, వన్య ప్రాణులు మన సహజ వారసత్తంలో ఒక ముఖ్యమైన భాగం, పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి సహాయ పడతాయని అన్నారు. ఫారులు వన్యప్రాణులను రక్షించాలని ఏ దైనా జంతువు కనపడితే వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు లేదా అటవీ శాఖ వారికి తెలియజేయాలని అదనపు డిసిపి రామ్‌కుమార్ సూచించారు. అక్రమ వేల లేదా వన్య ప్రాణులకు సంబంధించిన నేరాల ఘటనల, భావి తరాల కోసం మన వన్య ప్రాణులను రక్షించటంలో ప్రజల సహకారం అత్యవసరమన్నారు. మల్కాజ్‌గిరి సిపి సుమతి నేతృత్వంలో మల్కాజ్‌గిరి జోన్ డిసిపి శ్రీధర్ పర్యవేక్షణలో రోడ్ సేఫ్టీ డిసిపిఅండ్ ఎస్ఓటి మల్కాజ్‌గిరి ఇన్‌చార్జి కె.మనోహర్, మల్కాజ్‌గిరి అదనపు డిసిపి రామ్‌కుమార్, ఎస్ఓటి అదనపు డిసిపి నంద్యాల నర్సింహ్మారెడ్డి, జవహర్‌నగర్ ఏసిపి చక్రపాణి, శామీర్‌పేట ఎస్‌హెచ్ఓ సిఐ కె.నర్సింహ్మారెడ్డి, ఎస్ఓటి టీమ్ -11ఇన్స్‌పెక్టర్ కె.శ్రీనివాస్, శామీర్‌పేట పోలీసులు,ఎస్ఓటి మల్కాజ్‌గిరి-11టీమ్ సిబ్బంది అ అరెస్ట్‌లను వాటిని స్వాధీనం చేసుకునే ప్రక్రియను చేపట్టటం జరిగింది. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




వివరాలను విలేకరులకు వెల్లడిస్తున్న మల్కాజ్‌గిరి జోన్ అదనపు డిసిపి రామ్‌కుమార్




# ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలి

## బిఎల్‌వోలకు కలెక్టర్ మనుచౌదరి ఆదేశం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 12, ప్రభాతవార్త :** ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాలను నింపటంలో ఓటర్ల సందేహాలను బిఎల్ఓలు నివృత్తి చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ-స్వీకరణను బిఎల్ఓలు వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఆదివారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో జరుగుతున్న ఎస్ఐఆర్ (సర్) కార్యక్రమాన్ని కలెక్టర్‌తో పాటు జోనల్ కమిషనర్ మయాంక్‌సింగ్ కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగ కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ బిఎల్ఓలు ఎన్యుమరేషన్ ఫారాలను ఇవ్వటంలోనూ అదే విధంగా పూరించిన ఫారాలను తీసుకోవటంలోనూ బిఎల్ఓలు పూర్తి బాధ్యతగా వ్యవరించాలన్నారు. ఫారాలు పూరించటంలో ఓటర్ల సందేహాలను నివృత్తి పరుస్తూ వారికి అవగాహన కల్పించాలన్నారు. సర్ ప్రక్రియను వేగవంతం చేస్తూ తీసుకున్న ఫారాలను డిజిటలైజ్ చేయించాలని బిఎల్ఓలను కలెక్టర్ ఆదేశించారు. అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సూపర్‌వైజర్లకు అందించాలని బిఎల్ఓలను ఆదేశించారు. దీనికి ముందు కూకట్‌పల్లిలోని 371, 372,373,374పోలింగ్ బూత్‌ల్లో నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్, డిజిటలైజేషన్ ప్రక్రియలను కలెక్టర్ స్వయంగా పర్యటించి పరిశీలించారు. ఓటర్లతో నేరుగా మాట్లాడుతూ వారి సందేహాలను నివృత్తి చేస్తూ ఫారాలను ఏ విధంగా పూరించాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఆయనతో పాటు పలువురు సంబంధిత అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ ఈశ్వర్‌పై సస్పెన్షన్ వేటు

**మేడ్చల్, జూలై 12. ప్రభాతవార్త :** పార్టీ నియమావలి హద్దులు దాటి ప్రవర్తించిన విషయంపై వివరణ ఇవ్వాలని గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ ఈశ్వర్‌కు జారీ షోకాజ్ నోటీసుకు ఇచ్చిన వివరణ పీసీపీ కమిటికి, క్రమ శిక్షణ కమిటీకి సంతృప్తి పరచలేకపోవడంతో ఈశ్వర్‌ను కాంగ్రెస్ పార్టీ నుండి 6 నెలల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 3న ఈశ్వర్ ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌పై షోకాజ్ నోటీసు ఇవ్వగా తిరిగి ఈ నెల 5న ప్రెస్ మీట్ నిర్వహించి పార్టీ నియమాలను దిక్కరిస్తూ, తన పై వ్యక్తిగతంగా నా యొక్క పదవిని హేళన చేస్తూ మాట్లాడిన తీరును గమనించి, అతను ఇచ్చిన వివరణ సంతృప్తి చెందలేదని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈశ్వర్‌ను కాంగ్రెస్ పార్టీ నుండి 6 నెలల పాటు సస్పెండ్ చేస్తున్నామని తెలిపాడు.

## పెద్దేముల్ విద్యుత్ శాఖలో ఘోర నిర్లక్ష్యం

**★ఎల్సీ రిటర్న్ చేయకుండానే కరెంట్ ఆన్ ★కరెంట్ షాక్‌తో కాంట్రాక్ట్ కార్మికుడికి తీవ్ర గాయాలు.. ★అర్ధరాత్రి సబ్‌స్టేషన్ ముట్టడి ★8 గ్రామాల్లో చీకట్లు**

**పెద్దేముల్, జులై 12, ప్రభాతవార్త :** విద్యుత్ శాఖలో కిందిస్థాయి సిబ్బంది, లైన్ మెన్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికుల ప్రాణాలకు రక్షణ కరువైంది. అధికారులు, సబ్‌స్టేషన్ సిబ్బంది నిరక్ష్యం కారణంగా క్షేత్రస్థాయిలో ప్రాణాలకు తెగించి పనిచేసే సిబ్బంది ప్రమాదాల బారిన పడుతున్నారు. తాజాగా ఒకరి నిరక్ష్యం కారణంగా ఓ కార్మికుడు ఆసుపత్రి పాలు కాగా, మరోవైపు ఎనిమిది గ్రామాలకు రాత్రంతా కరెంటు సరఫరా నిలిచిపోయి ప్రజలు అంధకారంలో కొట్టుమిట్టాడాల్సి వచ్చింది. ఈ నెల 10న పెద్దేముల్ మండలం బుద్దారం గ్రామంలో వీధిలైట్లు సరిచేయడానికి గ్రామస్థులు విద్యుత్ ఏఈతో మాట్లాడి ఎల్సీ తీసుకున్నారు. బుద్దారం గ్రామానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు బోయిని శ్రీనివాస్ విద్యుత్ స్తంభం ఎక్కి తీగలు సరిచేస్తుండగా, పెద్దేముల్ సబ్‌స్టేషన్‌లో ఉన్న ఆపరేటర్ ఇస్మాయిల్ చేసిన తప్పిదం వల్ల ప్రమాదం జరిగింది. ఎల్సీ రిటర్న్ చేయకుండానే సబ్‌స్టేషన్ నుండి కరెంటు సరఫరాను ఆన్ చేయడంతో, స్తంభంపై ఉన్న శ్రీనివాస్ తీవ్రమైన కరెంట్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను స్థానికులు వెంటనే తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆపరేటర్ నిరక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలుసుకున్న బుద్దారం గ్రామస్థులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. అదే రాత్రి >>3



మృతురాలు ప్రియ

## ట్రెక్కింగ్ చేస్తూ మహిళ మృతి..

### అనంతగిరి అటవీ ప్రాంతంలో విషాదం

**వికారాబాద్,ప్రభాతవార్త :** అనంతగిరి అటవీ ప్రాంతంలో ఓ మహిళా టూరిస్టు ట్రెక్కింగ్ చేస్తూ మృతి చెందిన సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది.

ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అనంతగిరి అటవీ అందాలు వీక్షించేందుకు హైద్రాబాద్ నగరానికి చెందిన ప్రియా అనే మహిళ(47) కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సాయంత్రం వికారాబాద్‌కు చేరుకుని, అనంతగిరి అటవీ ప్రాంతంలోని ఓ ప్రైవేటు రిసార్టులో బస చేశారు.మరుసటి రోజు ఆదివారం ఉదయం అనంతగిరి అటవీ అందాలు వీక్షించించి, వికారాబాద్ జిల్లా ఫారెస్టు వారు ఏర్పాటు చేసిన అనంతగిరి అర్బన్ పార్కుకు చేరుకున్నారు. అక్కడ కుటుంబ సభ్యులతో కలిసి ప్రియా అటవీ ప్రాంతంలోకి ట్రెక్కింగ్‌కు వెళ్ళింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ప్రియా కుప్పకూలిపోవడంతో పక్కనే ఉన్న బంధువులు అటవీ శాఖ వారికి సమాచారం ఇచ్చారు.

అటవీ శాఖ సిబ్బంది ఆటోను రపించి బంధువుల సాయంతో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యులు ప్రియా ను పరీక్షించగా అప్పటికే ప్రియా మృతి చెందినట్లు వైద్యులు నిర్దారించారు. ప్రియా గుండె పోటుతో మృతి చెంది ఉండొచ్చని వైద్యులు వైద్యులు భావిస్తున్నారు. ఈ మేరకు వికారాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ పత్యానాయక్, కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి

## జలవనరులను ఉద్యమంలో పొదుపు చేయాలి

**ఆమనగల్లు, జులై 12, ప్రభాతవార్త:** జలవనరులను పొదుపుగా వినియోగించాలని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ నేనావత్ పత్యానాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన 'జల్ సంచాయ్ జన్ భాగీదారి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నీటి సంరక్షణ ఆవశ్యకతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని ఉద్యమంలో జల వనరులను పొదుపు చేయాలని కోరారు. భూగర్భ జలాలు పెంపొందించడానికి నివాసాలతోపాటు, కార్యాలయాలు, విద్యా సంస్థలు, ఇతర ప్రాంతాలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని కమి షనర్ రాఘవేందర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమలో పలువురు కౌన్సిలర్లతోపాటు మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ అశోక్ గజపతి రాజుకు కుమార్తె వివాహ శుభలేఖను అందజేస్తున్న బండ్ల గణేష్

## గోవా గవర్నర్‌కు బండ్ల గణేష్ ఆహ్వానం

**షాద్‌నగర్, జులై 12, ప్రభాతవార్త :** ప్రముఖ టాలీవుడ్ నిర్మాత బండ్ల గణేష్ తన కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించాలని గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజును మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను ప్రత్యేకంగా గోవా అధికార నివాసంలో కలిసి వివాహ శుభలేఖను స్వయంగా అందజేశారు. అనంతరం ఆయన క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకుంటూ కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో బండ్ల గణేష్ వెంట షాద్‌నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాండ్ర కాశీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

## స్టీల్ పరిశ్రమలో ప్రమాదం : కార్మికునికి తీవ్ర గాయాలు

**షాద్‌నగర్, జులై 12, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం వీర్లపల్లి గ్రామంలోని కనకదుర్గ స్టీల్స్ (శివ శక్తి స్టీల్స్) పరిశ్రమలో శనివారం ఉదయం జరిగిన ప్రమాదం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో పరిశ్రమ ఎలక్ట్రికల్ విభాగంలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన కార్మికుడు భరత్ కుమార్ మిశ్రా (46) తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ప్రమాదంలో ఆయ నకు సుమారు 75 శాతం వరకు కాలిన గాయాలు కావడంతో యాజమాన్యం హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిసిం ది. బాధితుడి పరిస్థితి విషమంగా ఉందని, కనీసం 45 రోజులపాటు అత్యవసర వైద్యం అవసరమని వైద్యులు సూచించినట్లు సమాచారం. అయితే చికిత్స ఖర్చులను తగ్గించుకునేందుకు యాజమాన్యం మరో ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తోందని తోటి కార్మికులు ఆరోపిస్తున్నారు. బాధితుడికి అత్యుత్తమ వైద్యం అందించి ప్రాణాలు కాపాడేందుకు యాజమాన్యం పూర్తి బాధ్యత తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారిక వివరాలు ఇంకా వెల్లడికాలేదు. అలాగే పరిశ్రమ యాజమాన్యం లేదా సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఘటనపై కార్మిక శాఖ, ఫ్యాక్టరీల శాఖ అధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న కార్మికుడు



## పోచమ్మకు బోనమెత్తిన కడ్మూరు

**పూడూరు, జులై 12, ప్రభాతవార్త :** పూడూరు మండల పరిధిలోని కడ్మూరు గ్రామంలో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రతిష్ఠాంగ హవనాలు, యంత్ర పూజ ప్రాణప్రతిష్ట అర్చన, బలి పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం పలు రకాల పిండి వంటకాలతో తయారు చేసిన పోచమ్మ బోనాలను దేవాలయం వరకు డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తరలించారు. వివిధ గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. శనివారం రాత్రి ఆలయంలో కడ్మూరు, మిట్టకంకల్ గ్రామాల భజన మండళ్లు ఆలపించిన సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలను కమిటీ సభ్యులు సన్మానించారు.



సుదర్శన్ తల్లికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

## కాంగ్రెస్ నేత సుదర్శన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

**షాద్‌నగర్, జులై 12, ప్రభాతవార్త :** ఫరూక్‌నగర్ మండలం హాజీపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సింగారం సుదర్శన్ మాతృమూర్తి సింగారం లక్ష్మమ్మ మృతి చెందారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు ఆదివారం ఉదయం ఆమె మృతదేహానికి నివాళులు అర్పించారు. కార్యకర్త సుదర్శన్‌కు ఎమ్మెల్యే తదితర నాయకులు ధైర్యం చెప్పారు. లక్ష్మమ్మ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, నర్సప్పగూడ కృష్ణ, జెట్టమహేందర్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలు అభివృద్ధి

**జిల్లేడు చౌదరిగూడ, జులై 12, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమౌతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని ధర్మ్య తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కర్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఆశయమని పేర్కొన్నారు. అనంతరం పెద్ద ఎల్కిచర్ల, పద్మారం గ్రామంలో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చందు నాయక్, రాం చంద్రయ్య, మాజీ ఎంపిటిసి సత్యనారాయణరెడ్డి, ఎండీ సలీం, నర్సింహులు, సత్యం, బీసీ సెల్ అధ్యక్షులు వెంకట్రాములు, ఎస్సి సెల్ అధ్యక్షులు రవి కుమార్, వేణు యాదవ్, వెంకటేష్ నందు, శ్రీను, మల్లేష్, లింగ గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# ఎమ్మెల్యే నా మిత్రుడే..

### ✦ఎందుకు కించపరుస్తున్నారో తెలీదు !

**షాద్‌నగర్, జులై 12, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపూర్ గ్రామంలో డంపు యార్డ్ నిర్వహణ కోసం 641 జీవో విడుదల చేసిన నాటి నుండి ఈ జీవోను అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా అ ప్రాంతాన్ని ప్రతిరోజు సందర్శిస్తున్నానని నిన్న మహిళలతో కలిసి గ్రామానికి వెళ్లే ప్రయత్నం చేస్తే

✦సిద్ధాపూర్ ప్రాంతంలో ఎమర్జెన్సీ కనిపిస్తోంది
✦ప్రశ్నించే గొంతులను నులిమేసే ప్రయత్నం
✦ బిజెపి నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

పోలీసులు అడ్డుకొని పోలీస్ స్టేషనులకు తనను తరలించడానికి బట్టి చూస్తే ఇక్కడ ప్రత్యేక ఎమర్జెన్సీ ఏదో విధించినట్లు తనకు అనిపిస్తుందని భారతీయ జనతా పార్టీ షాద్ నగర్ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సిద్ధాపూర్ డంప్ యార్డ్ ఏర్పాటు వ్యతిరేక ఉద్యమ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేశారు. షాద్‌నగర్ పట్టణంలో నిరాహార దీక్షలో భాగంగా దీక్షను విరమించారు. బీజేవైఎం యువనేత కొండోజు వంశీకృష్ణ చేతుల మీదుగా పళ్ళను తీసుకొని దీక్ష వహించారు. ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ పై ఉద్యమం చేస్తు ప్రశ్నించే గొంతులను నులిమేసే ప్రయత్నాలు ఇక్కడ కనిపిస్తున్నాయని అన్నారు. తనను నిన్న పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడంతో తను అక్కడే మొదటి రోజు నిరాహార దీక్షను చేపట్టానని ఇవి రిలే నిరాహార దీక్షలు అని నిన్ననే స్పష్టం చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు నిరాహార దీక్ష చేస్తున్నట్లు ప్రకటించాలని కొంతమంది మిత్రులు తప్పుగా అర్థం చేసుకొని నిరవధిక నిరాహార దీక్ష అనుకుని పొరబడ్డారని తెలిపారు. తను నిరవధిక రిలే నిరాహార దీక్షలు మాత్రమే చేస్తున్నానని దీనిని గ్రహించాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే శంకర్ తనకు మంచి మిత్రుడేనని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తను ఎమ్మెల్యేకు శ్రేయోభిలాషినని గుర్తు చేశారు. ఆయన కూడా శ్రేయోభిలాషి అని



మాట్లాడుతున్న పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా మాట్లాడితే మంచిగా మాట్లాడాలని కించపరిచే విధంగా మాట్లాడడం తగదన్నారు. ఎమ్మెల్యే శంకర్ తన గురించి ఇటీవలే కేప పాల్ తో పోల్చడం గర్వంగా ఉందన్నారు. కే ఏ పాల్ ఒక దళిత బిడ్డ అని వేలాది బ్రాంచ్‌లు అతనికి ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయని, వందలాది దేశాలలో అతనికి మంచి పేరు ఉందని అతనితో తనను పోల్చడం సంతోషంగానే ఉందన్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి జెట్ ప్లేన్ కొన్న ఒక గొప్ప దళిత బిడ్డ అని కొనియాడారు. అదేవిధంగా ఇటీవల జరిగిన ఆందోళన సందర్భంగా తను మంచి పనులు చేస్తే మంచి ఎమ్మెల్యే అంటారని చెత్త పనులు చేస్తే ప్రజలు చెత్త ఎమ్మెల్యే అంటారని అనుకుంటున్నారని తను చెప్పినట్లుగా చెప్పారు. అంతేతప్ప తాను ఎమ్మెల్యేను ఎక్కడ సొంతంగా విమర్శించలేదని అన్నారు. ఆ తర్వాత ఇటీవల జరిగిన మరో కార్యక్రమంలో ఎమ్మెల్యే పై ఎమ్మెల్సీ మాట్లాడిన తీరును కూడా ఖండించినట్లుగా మీడియా ముందు చెప్పారు.

# మైల్వార్ పంచాయతీలో 'పాత' రాజకీయం

★గెలిచి ఎనిమిది నెలలైనా బోర్డులపై ఎక్కని కొత్త పాలకమండలి పేర్లు ★రాజకీయ విభేదాల వల్లే మార్చడం లేదని వార్డు సభ్యుల ఆరోపణ ★అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్

**బషీరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** ఎన్నికలు జరిగి, కొత్త పాలకమండలి కొలువుదీరి ఎనిమిది నెలలు గడుస్తున్నా.. ఆ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాత్రం ఇంకా పాత సభ్యుల పేర్లే దర్శనమిస్తున్నాయి. బషీరాబాద్ మండల పరిధిలోని మైల్వార్ గ్రామ పంచాయతీలో నెలకొన్న ఈ విచిత్ర పరిస్థితి ఇప్పుడు స్థానికంగా పలు వివాదాలకు, చర్చలకు తావిస్తోంది.

**సర్పంచ్ వర్గం వర్సెస్ ప్రతిపక్షం**

మైల్వార్ గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల తర్వాత ఇక్కడి రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. మొత్తం తొమ్మిది వార్డులకు గాను .. సర్పంచ్ వర్గం (కాంగ్రెస్)లో ఐదుగురు వార్డు సభ్యులు, అధికార పార్టీకి విపక్షంగా ఉన్న మరో నలుగురు అభ్యర్థులు, ఇండిపెండెంట్‌గా 9వ వార్డు నుండి ఒక మహిళా అభ్యర్థి ఎన్నికయ్యారు. దీంతో పంచాయతీలో సర్పంచ్ వర్గానికి ఐదుగురు, ప్రతిపక్షంగా ఐదుగురు సభ్యుల చొప్పున బలాబలాలు సమానంగా మారాయి. ఈ రాజకీయ సగానికి సగం విభేదాల వల్లే కొత్తగా ఎన్నికైన సభ్యుల పేర్లను పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించకుండా తొలగించారని వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు.

ఎన్నికలు ముగిసి ఇన్ని నెలలవుతున్నా పాత సభ్యుల పేర్లతోనే పాలన కొనసాగించడం ఏమిటని నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు తమను గెలిపించినా,



పంచాయతీ కార్యాలయంలో దర్శనమిస్తున్న పాత వార్డు సభ్యుల పేర్ల పట్టిక



కార్యాలయంలో కనీసం తమ పేర్లు కూడా ప్రదర్శనకు నోచుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, వివాదాలకు స్వస్తి పలికి.. నూతనంగా ఎన్నికైన సభ్యుల వివ రాలను పంచాయతీ కార్యాలయంలో అధికారికంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని మైల్వార్ వార్డు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

## వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడులు

**ఘట్‌కేసర్ రూరల్. జులై 12, ప్రభాతవార్త:** పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సద్భావన్ టౌన్‌షిప్‌లో గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ప్లాట్‌పై పోలీసులు ఆకస్మిక దాడి జరిపి ఆరుగురిని అదుపులోకి తీసుకున్న సంఘటన చోటు చేసుకుంది. ముందస్తు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పోచారంలోని సద్భావన టౌన్‌షిప్‌లోని ఓ ప్లాట్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారని సమాచారం అందింది. ప్లాట్‌పై పోలీసులు దాడి జరిపి అరుగురిని అదుపులోకి తీసుకుని ఓ మహిళను రక్షించినట్లు తెలిపారు. వారి వద్ద పలు మొబైల్ ఫోన్లు, వాడినవి, వాడనవి కండోమ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వ్యభిచార నిర్వహకురాలు యాప్ ద్వారా పోటోలు పంపించి వీటులను ఆకర్షిస్తున్నట్లు తెలిపారు. వ్యభిచారం, మానవ అక్రమ రవాణా, అసాంఘిక సమాచారం తెలిస్తే డయల్ 100కు, లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు.



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న అభిమానులు

## రామేశ్వరాలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం

**కేశంపేట జులై 12 ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని రామేశ్వరం ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయల విరాళాన్ని అందజేస్తామని పల్లె బ్రదర్స్ హామీ ఇచ్చారు. కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పల్లె బ్రదర్స్‌లో ఒకరైన పల్లె బాలేశ్వర్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఆదివారం రామేశ్వర ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధిలో భాగంగా కోనేరు పునరుద్ధరణకు కావలసిన సామాగ్రి సమకూర్చుకునేందుకు ఒక లక్ష రూపాయలు పల్లె బ్రదర్స్ అయినా పల్లె ఆనంద్ కుమార్ పల్లె బాలేశ్వర్ అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు అనంతరం వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బుర్రి మల్లేష్ గౌడ్, వీరమల్ల శివకుమార్, వీరమల్ల అనిల్ కుమార్, కానం రాజు గౌడ్,బండ మల్లేష్ యాదవ్, అనెమోని శేఖర్, గుర్క మహేష్ యాదవ్, మావిళ్ళ రమేష్ యాదవ్, ఆలయ ఈవో శివకుమార్, సంపత్ కుమార్, ప్రభాకర్ అయ్యగారు రవి, కిరణ్ కుమార్, నర్సింలు గౌడ్ తదితరులులు పాల్గొన్నారు.

## మరింత ఉత్సాహంగా పనిచేయండి

**యాచారం, జులై12, ప్రభాతవార్త :** యాచారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీశైలం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా తాడిపర్తి గ్రామానికి చెందిన నీలం రాములు ముదిరాజ్‌ను గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బైకని వినోద్‌లకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ..గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతకు కృషి చేయాలి,రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడపగడపకు తీసుకెళ్లాలి అర్హులందరికీ రెండో దప ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అందిచనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పనిచేయలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు ,డిసిసి ఉపాధ్యక్షులు ముత్యాల వెంకటరెడ్డి, బి ఎన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిల్లకంటి శేఖర్ రెడ్డి,సర్పంచ్ లు దేంది రాంరెడ్డి, కేషమోని రాజు, సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ లిక్కి శ్రీనివాస్ రెడ్డి, వెంకట నరసింహారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పాశం జయప్రకాష్,గ్రామ నాయకులు మదర్ డెయిరీ డైరెక్టర్ మండలి జంగయ్య, మాజీ సర్పంచ్ దుస రమేష్, వార్డు సభ్యులు దశరథ, యూసుఫ్ పఠాన్, నీలం పాండు, మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మొతకని మంజుల, మండలి యాదగిరి, శ్రీకాంత్ , నీలం శ్రీనివాస్, సురేష్, కొప్పు శివ, బైకని వెంకటేష్, మధు, పెంటయ్య,చెన్నయ్య, బుగ్గయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## మాజీ ఎంపిటిసి కిష్టమ్మ హఠాన్మరణం

**కేశంపేట, జులై 12, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ దిద్దేల కిష్టమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం నిర్దావెల్లి గ్రామంలోని గిద్దల కిష్టమ్మ ఇంటికి వెళ్లి ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించారు. తాను పార్టీ పరంగాను, వ్యక్తిగతంగాను కిష్టమ్మ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉప సర్పంచ్ ఆమెర్, జంగయ్య, మల్లయ్య, ముత్యాలు, బాలస్వామి, కాజా పాషా, రాజేందర్, మల్లేష్ తదితరులు నివాళులు అర్పించారు.



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

## అండర్ డ్రైయినేజీ పనులకు శ్రీకారం

**కేశంపేట, జులై 12, ప్రభాతవార్త :** కేశంపేట మండలంలోని కొనాయపల్లిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు సర్పంచ్ సొప్పరి ధనలక్ష్మి రామక్రిష్ణ ముదిరాజ్ ఆదివారం ఉదయం కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ఈ భూగర్భ మురుగునీటి వ్యవస్థను డిజైన్ చేశామన్నారు. దీనివల్ల వీధుల్లో మురుగునీరు నిలిచే సమస్య తప్పుతుందని, దోమల నివారణతో పాటు ప్రజలు సీజన్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ హనుమంత్ నాయక్, వార్డు సభ్యులు రంగు నర్సింహ, చిత్రమోని శ్రీలత రాజు, బర్కం రామకృష్ణ, గ్రామ పెద్దలు కల్వాల కృష్ణయ్య, సొప్పరి నర్సింహ, రంగు శ్రీకాంత్, బర్కం మహిపాల్, కాకర్ల సునీల్, గోపు రాము, చిత్రమోని చెన్నయ్య, సోమరాజు మహేష్, సొప్పరి నరేందర్, బర్కం రమేష్, శగంటి శ్రావణ్ కుమార్, శగంటి రాజశేఖర్, శగంటి వెంకటేష్, సొప్పరి శివప్రసాద్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నుంచి నియామక పత్రం అందుకుంటున్న నూతన అధ్యక్షులు



ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

## వైభవంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ట

**నందిగామ, జులై 12, ప్రభాతవార్త :** నందిగామ మండలం రంగాపూర్ గ్రామంలో ఆదివారం బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు మాజీ ఎంపీపీ ఎం శివ శంకర్ గౌడ్, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, సిడితండా సర్పంచ్ గబ్రు చౌహన్, వెంకమ్మగూడ సర్పంచ్ గోర్లపల్లి అశోక్, బుగ్గోని గూడ సర్పంచ్ సాలయ్య, ఉప సర్పంచ్ బసవరాజ్, సిడి తండా ఉపసర్పంచ్ రవీందర్, గోవు రవికుమార్, కల్వకోల్ శేఖర్ గౌడ్, హనుమంతరావు, ఆవుల జ్ఞానేశ్వర్, కావలి కృష్ణ, రాజగోపాల్, చెన్నకేశవులు, జింకల జంగయ్య, రాధాకృష్ణ, శివగళ్ళ సుమన్, రంగాపూర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్‌లో అంబేద్కర్ వర్సిటీ స్టడీ సెంటర్

**జవహర్‌నగర్, జులై 12, ప్రభాతవార్త:** స్థానిక జవహర్‌నగర్‌లోని సీఆర్ పీఎఫ్ గ్రూప్ సెంటర్, రంగారెడ్డి క్యాంపస్‌ను డా.బి.ఆర్. అంబే ద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌గా ఎంపిక చేసినట్లు గ్రూప్ సెంటర్ డీఐజీపీ డా. బి. వీరరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్టడీ సెంటర్ ద్వారా పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతకు, ఉద్యోగులకు, విద్యను కొనసాగించాలనుకునే వారికి ఎంతో ప్రయోజనం చేకూరు తుందని ఆయన పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌తో పాటు దూర విద్యా విధానంలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే బి.ఏ. బి.కాం.బి.ఎస్సీ తదితర డిగ్రీ కోర్సులను దూర విద్యా విధానంలో అభ్యసించేందుకు ఈ స్టడీ సెంటర్ అవకాశం కల్పిస్తుందని చెప్పారు. ఈ ప్రాంతంలో విద్యా కేంద్రం ఏర్పాటు కావడం శుభపరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు. స్టడీ సెంటర్ కోఆర్డినేటర్‌గా సీఆర్‌పీఎఫ్ పబ్లిక్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ హరిశంకర్‌ను నియమించినట్లు తెలిపారు. ప్రవేశాలు, కోర్సులు ఇతర వివరాల కోసం సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారిని సంప్రదించాలని కోరారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తా

**నందిగామ, జులై 12, ప్రభాతవార్త :** తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన ప్రభుత్వంలో గుడిసె లేని ఇల్లు నిర్మించాలన్నదే ప్రధాన లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఆదివారం నందిగామ మండలం సిడిత్నాడ గ్రామపంచాయతీ పరిధిలోని తాటిగడ్డ తండాలో వృద్ధ మహిళ(86) జెటావత్ జాకీకు మంజూరు అయిన ఇంది రమ్మ ఇంటిని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అర్హు లైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్, మాజీ అధ్యక్షుడు జంగ నరసింహులు, సర్పంచ్‌లు కొమ్ము కృష్ణ, గొర్లపల్లి అశోక్, మంకాల శ్రీశైలం, బుగ్గ సాలయ్య, రంగాపూర్ సర్పంచ్ కుమారుడు గోవు రవికు మార్, సిడితండా ఉప సర్పంచ్ ఎం రవీందర్ నాయక్, ఉప సర్పంచ్‌లు బసవరాజ్, ఆవుల మంద శివశంకర్, సిడితండ పంచాయతీ కార్యదర్శి రవీందర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్పల్లి, జులై 12, ప్రభాతవార్త:** మండలంలోని పిల్లిగుండ్ల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బెగరి నర్సింలు కుటుంబాన్ని సర్పంచ్ ఆకుల పద్మ సంజీవరెడ్డి ఆదివారం నాడు పరామర్శించారు. ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య, సర్ధార్ అలి, మొగులయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

## నేడు మర్పల్లికి అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ రాక

**మర్పల్లి, జులై 12 ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలో సోమవారం నాడు జరగనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొంటారని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సురేశ్ యాదవ్ తెలిపారు. 3 కోట్ల 50 లక్షల రూపాయలతో పట్లూర్‌లో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాప చేస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో రూ.2.5 కోట్ల వ్యవయంతో నిర్మంచిన ప్రథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారని వివరించారు. పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చెయ్యాలని కోరారు.



సర్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ శేఖర్

## బిఎల్‌వోలు నిబద్ధతో పనిచేయాలి

**ఘట్‌కేసర్ రూరల్, జులై 12, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ 8వ వార్డులోని చౌదరిగూడలో ఆదివారం తహసీల్దార్ శేఖర్ ఆకస్మికంగా పర్యటించి సర్ ప్రక్రియపై బిఎల్‌వోల పనితీరును పరిశీలించారు. గ్రామంలోని 380 పోలింగ్ బూత్‌ను సందర్శించారు. ప్రజలకు అందజేస్తున్న దరఖాస్తు ఫారాలు వాటి నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యన్ని బలోపేతం చేసే ఓటరు నమోదు ప్రక్రియలో బీఎల్‌వోలు నిబద్ధతతో పనిచేయాలని తాహసీల్దార్ సూచించారు. టీపీసీసీ లీగల్ సెల్ పాలడుగుల అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి కాంగ్రెస్ జెండా ఆవిష్కరణలు

**ఘట్‌కేసర్ రూరల్, జులై 12, ప్రభాతవార్త:** పోచారం డివిజన్‌లో ఈ నెల 13వ తేది నుండి పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపడుతున్నట్లు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం డివిజన్ పరిధిలోని ఇస్మాయిల్ ఖాన్ గూడ, యంనంపేట్ గ్రామాల్లో జెండా ఆవిష్కరణతో పాటు సర్ ప్రక్రియపై పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలపై బాధితుల నుండి వినతి పత్రాలు స్వీకరిస్తామని తెలిపారు. స్థానిక పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ఎన్యూమరేషన్ పత్రాలను మహిళకు అందజేస్తున్న మైనార్టీ నేతలు

## సర్ హెల్ప్‌డెస్కుకు విశేష స్పందన

**ఆమనగల్లు, జులై 12, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలో కొనసాగుతున్న సర్ ఓటర్ల జాబితా నమోదులో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముస్లిం మైనార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్ డెస్కు మంచి స్పందన లభిస్తుంది. ఆదివారం పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు. జామా మసీదు కమిటీ మాజీ అధ్యక్షుడు సయ్యద్ ఖలీల్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు హెల్ప్‌డెస్కు అందుబాటులోకి తీసుకువచ్చారు. పట్టణంలోని ప్రేమ్‌నగర్ కాలనీలోని జలాలుద్దీన్ వలియా దర్గా వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. సర్ పట్ల ప్రజల్లో నెలకొన్న భయాలు, అపోహాలు, ఆందోళనలు తొలగించి అవగాహన కల్పిస్తూ బిఎల్ఓలు అందజేసిన పత్రాలను హెల్ప్‌డెస్కు కేంద్రంలో పూర్తి చేసి ఇచ్చారు. కార్యక్రమంలో ముస్లీం మైనార్టీ నాయకులు మహబూబ్ ఖురేషి, హైమద్, అజీమ్, ఫారుఖ్, సమీయుద్దీన్ (అబ్బు) అబ్దుల్ హఫీజ్, షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**దుద్యాల్, జులై 12, ప్రభాతవార్త:** హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్సెస్సీ 1987-88 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్న సహపాఠులు బాల్య జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన మాజీ ప్రధానోపాధ్యాయులు రామ్‌రెడ్డి, ఉపాధ్యాయులు జగదీష్‌కుమార్, రఘుపతిరెడ్డి, శీలాదేవి, పిఈటి అనిల్ అలాగే అటెండర్ కిష్టప్ప, వాచ్‌మెన్ లక్ష్మయ్యలను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పూర్వ విద్యార్థి మేర్గు వెంకటయ్య మాట్లాడుతూ, విద్యార్థి దశలో నేర్చుకున్న విలువలే తన జీవిత ప్రయాణానికి బలమైన పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు. స్నేహితుల ఆప్యాయ పలకరింపులు, గురువుల ఆశీర్వాదాలు, పాత జ్ఞాపకాలతో సాగిన ఈ సమ్మేళనం అందరికీ చిరస్మరణీయ అనుభూతిని మిగిల్చింది. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోవర్ధన్‌రెడ్డి, అనంతరెడ్డి, రమణారెడ్డి, ప్రభాకర్ గౌడ్, బుస్స చంద్రయ్య, మేర్గు వెంకటయ్య, కరీం, మోహిద్, అంజయ్య, వెంకటాచలం, రమేష్, కృష్ణ, గోపి, రిజ్వానా బేగం, వనజ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.




కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

## కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులకు సన్మానం

**మేడ్చల్, జులై 12, ప్రభాతవార్త :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్ పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కాయిత ఆంజనేయులు ముదిరాజ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘానికి చెందిన మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చాపరాజు ముదిరాజ్, గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం సభ్యులు శాలువాతో సత్కరించి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.

### 153 మందికి కంటి ఆపరేషన్లు

**తలకొండపల్లి జులై 12, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నాడు ముగిసింది. తలకొండపల్లి మండల కేంద్రంలో ఈనెల 4 నుంచి నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వృద్ధులు యువకులు పాల్గొని తమ కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. మొత్తం 153 మందికి ఉచిత ఆపరేషన్లు, 700 మందికి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గం లోని ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించిన ఈ కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి అన్యూయస్పందన లభించిందని, మొత్తం ఐదు వైద్య శిబిరాలు నిర్వహించగా 7000 మంది శిబిరాలను సందర్శించి 4300 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. చెన్నై రాష్ట్రం నుంచి శంకర నేత్ర వైద్య డాక్టర్లను రప్పించి శిక్ష ఈ ఈ శిక్షణను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. శిబిరానికి వచ్చిన వారు మాట్లాడుతూ రాఘవేందర్ రెడ్డి సహకారంతో తాము కోల్పోయిన కంటి చూపుని చూడగలుగుతున్నామని, తమ వద్దకే వచ్చి తమకు ఆపరేషన్లతో పాటు అద్దాలు అందజేయడం స్ఫూర్తి నింపిందని ఈ సందర్భంగా వారు కొనియాడారు. అనంతరం పలువురికి రాఘవేందర్ రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కటికల శేఖర్ శీను చంద్రశేఖర్ ఇమ్మడి మహేష్ రామకృష్ణ సుధాకర్ వెంకటేష్ కళ్యాణ్ నాయక్ అంజన్ రెడ్డి బాలస్వామి శేఖర్ యాదవ్ కృష్ణ నాయక్ శంకర్ నాయక్ ధర్మ నాయక్ సినిమా నాయక్ రమేష్ నాయక్ నిర్మల శ్రీశైలం జ్యోతి రవీందర్ మల్లేష్ భారతమ్మ శ్రీనివాస్ రజిత రాజు నాయక్ మల్లేశ్వర తోపాటు ఆయా గ్రామాల ఉపసర్పంచులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



దేవునిఎర్రవల్లిలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## ఓటరు జాబితాపై అవగాహన కలిగి ఉండాలి

**చేవెళ్ల, జులై 12, ప్రభాతవార్త :** ఓటరు జాబితాపై ఓటర్లు అవగాహన కల్గి ఉండాలని చేవెళ్ల మండల బిఆర్ఎస్ అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్ సూచించారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు దేవుని ఎర్రవల్లి గ్రామంలో బస్తేపురం శ్రీశైలం ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల మండల బిఆర్ఎస్ అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, అలాగే ఓటరు జాబితాలో పేరు చేర్పు, తొలగింపు, సవరణలు అవసరమైతే ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అందరూ చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్ భాస్కర్ రెడ్డి, నత్తి కృష్ణారెడ్డి, పెంజర్ల అనంత్‌రెడ్డి, చాకలి కృష్ణ, పెద్దోళ్ల శ్రీను, కంకంటి శ్యామలయ్య, కావాలి మహేందర్, కరికె శ్రీనివాస్, సాలే మాణిక్యం, విఠలయ్య, సోమయ్య చారి, అర్జున్ వెంకటేష్, ప్రణీత్ రెడ్డి, తీలివీ గడ్డమిది శ్రీనివాస్, సిద్ధి బాలు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

**శంషాబాద్, జులై 12, ప్రభాతవార్త :** బైక్ అదుపు తప్పి రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్ రెడ్డి వివరాలు ప్రకారం... గుండ్లపోట్లపల్లి గ్రామానికి చెందిన ఉరడి బాలకృష్ణ (32), ప్రస్తుతం సైదాబాద్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కుటుంబ కార్యక్రమం నిమిత్తం రాజాపూర్ మండలం గుండ్లపోట్లపల్లి స్వగ్రామానికి బైక్ (టి ఎస్ 06ఈ ఎక్స్ 9572)పై వెళ్లి కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి సైదాబాద్‌కు బయలుదేరాడు. ఆదివారం మధ్యాహ్నం సుమారు 3:30 గంటల సమయంలో పాలమాకుల గ్రామ పరిధిలోని స్ప్రింగ్ ల్యాండ్ ధాబా ఎదురుగా ఉన్న విబీ44పై శంషాబాద్ వైపు వస్తుండగా, అతను నడుపుతున్న బైక్ అదుపుతప్పి రోడ్డుకు ఎడమవైపున ఉన్న సిమెంట్ దిమ్మెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు, కుడి మోచేతికి తీవ్ర గాయాలు కావడంతో ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న శంషాబాద్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## జూబ్లీహిల్స్‌లో సినీతారల సందడి

**జూబ్లీహిల్స్, జులై 12, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన ఫెస్టిగోవ్ డిజైనర్ స్టూడియోలో సినీనటులు సందడి చేశారు. నటులు శ్రీయాశరణ్, మంచు లక్ష్మి, నవదీప్ పాల్గొని భారతీయ లగ్జరీ చేనేత, కౌట్యూర్‌లను విష్కరించారు. అమెరికాలో పేరుగాంచిన ఈ ఫెస్టిగోవ్ అమెరికా వెలుపల ఏర్పాటుచేసిన తొలిస్టోర్‌గా గుర్తింపు పొందింది. కార్యక్రమంలో నిర్వాహకులు భావన ధనేకుల, సింధు కొసరాజు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఉద్యమకారులు

**మేడ్చల్, జులై 12. ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమం కోసం ప్రభుత్వం కే కే కమిటీని ఏర్పాటు చేయడం హర్షణీయమని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం మేడ్చల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యమకారులు మాట్లాడుతూ కేకే కమిటీ ఇచ్చే సూచనలను స్వాగతిస్తున్నామని, దీంతో పాటు ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యమకారుల గుర్తింపు కోసం ఒక జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

నిర్దేశిత కాలవ్యవధిలో అర్హులైన ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని, వయోపరిమితి దాటిన వారికి బ్యాంక్ రుణాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సంక్షేమం కోసం ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిపించి, గుర్తింపు పూర్తయిన వెంటనే ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, తగిన నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా తీర్మానం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఉద్యమకారుల పిల్లల చదువులకు పూర్తి స్థాయి ఫీజు రీఇంబర్స్మెంట్ అందించడంతో పాటు, విద్య, ఉద్యోగ రంగాల్లో కనీసం 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా ఉద్యమకారులందరికీ ఇల్లు లేదా ఇంటి స్థలాన్ని కేటాయించాలని, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రత్యేక హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలతో పాటు నామినేటెడ్ పదవుల భర్తీలోనూ ఉద్యమకారులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, జీహెచ్ఎంసీ పరిధిలో స్థలం అందుబాటులో లేకపోతే, ఉద్యమకారులు మరియు జర్నలిస్టుల భాగస్వామ్యంతో ప్రత్యేక కాలనీలను నిర్మించి, ఆ ప్రాంతాలకు ఆచార్య జయశంకర్ కాలనీ, రాయ్ శేఖర్ కాలనీలుగా నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఏసీ నాయకులు నాగుర్ల సంజీవరావు, నంది పాండు, మంచాల లక్ష్మణ్, జి. మల్లారెడ్డి, టీ. మల్లేష్, గాంధీ వెంకటయాదవ్, రాజేష్, ఆదిరెడ్డి, ప్రవీన్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, మల్లికార్జున్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల ముఖాల్లో చిరునవ్వులు

**కొత్తూరు, జులై 12, ప్రభాతవార్త:** నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేస్తూ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పాలనకు కొత్త నిర్వచనం ఇస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు, తిమ్మాపూర్‌లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని లబ్ధిదారులతో కలిసి ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.

సొంతిల్లు అనేది ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీక అని, ఆ గౌరవాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా వేలాది నిరుపేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జే. సుదర్శన్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ సాహితి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, నాయకుడు వీరమోని దేవేందర్ ముదిరాజ్, కుమారస్వామి గౌడ్, సీనియర్ కమ్మరి జనార్దన్ చారి, సర్పంచులు కొమ్ము కృష్ణ, మంకాల శ్రీశైలం, గొల్లపల్లి అశోక్, మాజీ సర్పంచ్ ఏనుగు జనార్దన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేందర్ గౌడ్, కర్రోళ్ల సురేందర్, వన్నాడ శివశంకర్ గౌడ్, మహేష్ గౌడ్, ఇందూరి శ్రీనివాస్, నవీన్ చారి, చిలకమ్మరి నరసింహ, పెద్దిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, తుప్పర రమేష్, శివకుమార్ గౌడ్, కొండా శ్రీను, జగన్ గౌడ్, చింత సాయి తేజశ్వర్, నరసింహ గౌడ్, సురేష్, గాని తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా పాదయాత్ర

**జవహర్‌నగర్, జులై 12, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్య భద్రత, జీవించే హక్కు కోసం రాంకీ చెత్త డంపింగ్ యార్డును తక్షణమేతొలగించాలని పిఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి.సంధ్య డిమాండ్ చేశారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారంనిర్వహించిన ప్రజాచైతన్య పాదయాత్రలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ నాయకురాలు, పోరాట కమిటీ సహకన్వీనర్ అనురాధ అధ్యక్షతన కీసర సర్కిల్ పరిధిలోని జవహర్‌నగర్, గిరిప్రసాద్ నగర్, గబ్బిలాలపేట ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. రాంకీ డంపింగ్ యార్డు వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జులై 26న శాస్త్రవేత్తలతో నిర్వహించనున్న భారీ ప్రజా అవగాహన సదస్సును విజయవంతం చేయాలని సామాజిక కార్యకర్త అంబికా, పిఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు డి.స్వరూప, అనసూయ, సరిత, సిఎంఎస్ జ్యోతి, శ్రీదేవి, ఇఫ్టూ అరుణక్క తదితరులు ప్రజలకు పిలుపునిచ్చారు.

శాంతినగర్, వైఎస్సార్ నగర్, కార్మిక్ నగర్, గబ్బిలాలపేట, ఈస్ట్ నందమూరి నగర్, గిరిప్రసాద్ నగర్, చెన్నాపూర్, దేవేందర్ నగర్, వడ్డెర బస్తీతో పాటు వందకు పైగా బస్తీల ప్రజలు డంపింగ్ యార్డు కారణంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటూ ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలుగా డంపింగ్ యార్డును తొలగిస్తామని హామీలు ఇస్తున్నప్పటికీ అమలు కాలేదని విమర్శించారు.




ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, సహకన్వీనర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే సమస్య తీవ్రతను గుర్తించి డంపింగ్ యార్డు విషయంలో నిర్ణయాత్మక చర్యలు చేపట్టాలని, లేకపోతే భవిష్యత్తులో జరిగే ప్రజా ఆందోళనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా శివశంకరి గోశాల ప్రారంభోత్సవం

**ఘట్‌కేసర్, జులై 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీశివశంకరి వేదపీఠంలో ఆదివారం గోశాల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. వేదపీఠం నిర్వహకులు కాశీకోటేశ్వరశర్మ ఆయన కుమారుడు శివ సమక్షంలో మేడ్చల్ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. శ్రీశివశంకరి గోశాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించిన అనంతరం ఆయన గోమాతకు పూజలు చేశారు. ఈసందర్భంగా విచ్చేసిన సుధీర్‌రెడ్డి, నాయకులను నిర్వహకులు శాలువాతో సత్కరించి ఆశీర్వచనంతో శ్రీలలిత త్రిపుర సుందరీ చిత్రపటాన్ని అందించారు. నిత్యం గోవును దర్శించుకొని ఆహారం తినిపించడం పూజ చేయడం ద్వారా పాపాలు నశించి కోటిజన్మల పుణ్యఫలం సిద్ధిస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, డిసిసి కార్యదర్శి మామిండ్ల ముత్యాలుయాదవ్, మాజీ సర్పంచ్ మెడబోయిన వెంకటేశ్, మాజీ కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, కడపొల్ల మల్లేశ్, కీసరగుట్ట డైరక్టర్ పాముకుంట్ల ప్రభాకర్‌గౌడ్, కొమురవెల్లి డైరక్టర్ మెరుగు నరేశ్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు గడిల రాంచంద్రారెడ్డి, నాయకులు కందకట్ల మాధవరెడ్డి, సిద్దగోని నర్సింహ్మాగౌడ్, మేకల సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎఫ్‌సీనగర్‌లో శివశంకరి గోశాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

### ఘనంగా విశ్వశాంతియాగం

**ఘట్‌కేసర్, జులై 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లోని శ్రీభ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి దేవాలయంలో ఆదివారం 20వ విశ్వశాంతియాగం ఘనంగా నిర్వహించారు. ఆలయ యజ్ఞ నిర్వహణకర్త కంట్లం గౌరీశంకర్ ఆధ్వర్యంలో ప్రతినెల మాసశి వరాత్రి రోజున లోకకళ్యాణార్థం విశ్వశాంతియాగం నిర్వహిస్తున్నారు. మల్లిఖార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ ఆవరణలోని విష్ణువినాయక కళ్యాణ మండపంలో విశ్వశాంతి యజ్ఞం నిర్వహించారు. నిర్వహకులు కంట్లం గౌరీశంకర్, కళావతి దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయంలోని శివలింగానికి అభిషేకం చేశారు. అర్చకులు కుమారస్వామి మంత్రోచ్చారణాల మధ్య విశ్వశాంతి హోమం ఘనంగా జరిపారు. ప్రపంచంలో శాంతి నెలకొని ప్రజలందరూ సుభీష్టంగా ఉండాలని పరమేశ్వరున్ని వేడుకుంటూ ప్రతినెలా యగం చేస్తున్నామని గౌరీశంకర్ తెలిపారు. అనంతరం భక్తులకు పంచామృత తీర్థ ప్రసాద వితరణ చేశారు.



ఎదులాబాద్‌లో యాగం నిర్వహిస్తున్న దృశ్యం

# షాబాద్ ఉన్మాదిని ఉరి తీయాలి

### మానవ హక్కుల ఫెడరేషన్ నేత డిమాండ్

**నందిగామ, జులై 12, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని అంతర్జాతీయ మానవ హక్కుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కేతావత్ హరిలాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలను భయంభ్రాంతులకు గురిచేసిన ఈ సంఘటనపై త్వరలోనే డిఐజి, సిపిని కలిసి నివేదిక అందజేస్తామన్నారు. మైనర్ బాలికపై ఫోక్సో కేసులో అరెస్ట్ బెయిల్‌పై విడుదలైన నిందితుడు బాధిత కుటుంబాన్ని బెదిరిస్తున్నప్పటికి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసిన తగు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుడు రాజ్ కుమార్ ను వెంటనే అరెస్ట్ చేసి బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

**పోలీసులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదు**

**షాద్‌నగర్, జులై 12, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల ఘటన అత్యంత బాధాకరమని కార్మిక సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ ఘటనలో నిందితుడికి సహకరించిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఘటన పూర్తిగా పోలీసు వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. కేవలం సంబంధిత పోలీసు అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని, ఈ ఘటనకు దారితీసిన అన్ని కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితుడికి ఎలాంటి సహకారం అందించినా, అతడి తరఫున ఎవరైనా పైరవీలు చేసినా వారిని కూడా చట్టం ముందు నిలబెట్టి శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పోలీసులకు ఫోన్ చేసి నిందితుడి తరఫున మాట్లాడిన రాజకీయ నాయకులు లేదా ఇతర వ్యక్తులు ఎవరైనా ఉంటే వారి వివరాలను బహిర్గతం చేసి, వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా, నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. చివరగా, ఈ ఘటనలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సంపూర్ణ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు వ్యవస్థను మరింత బాధ్యతాయుతంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.



## ఎమ్మార్పీఎస్‌తో అన్ని వర్గాలకూ సామాజిక న్యాయం

**యాచారం, జులై12, ప్రభాతవార్త :** నంది వనపర్తి నూతన ఎమ్మార్పీఎస్ అధ్యక్షునిగా మూలి రాకేష్( లాజర్)ను నియమిస్తూ నియామక పత్రాన్ని వీహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మూలి మహేష్ అందజేశారు. ఆదివారం యాచారం మండలం, నంది వనపర్తి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ సమావేశం ఎంఎస్ఎఫ్ గ్రామ శాఖ అధ్యక్షులు ముచ్చర్ల రాకేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య, ఎమ్మార్పీఎస్ యాచారం మండల అధ్యక్షులు మూలి మహేష్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితంగా అన్ని వర్గాల ప్రజలకు సామాజిక సమానత్వ లాంటి మేలు జరిగిందన్నారు.

గ్రామ శాఖ అధ్యక్షులుగా మూళి రాకేష్ (లాజర్)..అధికార ప్రతినిధిగా ముచ్చర్ల యాదగిరి, ఉపాధ్యక్షులుగా గుండ్రపల్లి బుగ్గ రాములు, ముచ్చర్ల సంతోష్, ప్రధాన కార్యదర్శిగా ముచ్చర్ల సాయికిరణ్ కోశాధికారిగా ఎంజాల రాములు సహాయ కార్యదర్శిలుగా మూళి విష్ణు, మూలి సూర్య, ప్రచార కార్యదర్శిగా మూలి శివ, సలహాదారులుగా కాళ్ల జంగయ్య, ఎంజాల అంజయ్య, యంజాల చంద్రకాంత్, ముచ్చర్ల వెంకటరమణ, ముచ్చర్ల జంగయ్య, మూలి జంగయ్య, ముచ్చర్ల సతీష్ పంది సుధాకర్ పంది శ్రీను, గడ్డం దయాకర్ గడ్డం సుధాకర్‌లను ఎన్నుకున్నారు.

## మద్యం మత్తులో పురుగుల మందు తాగి మృతి

**శంషాబాద్, జులై 12, ప్రభాతవార్త :** మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, పెద్దగోల్కొండ గ్రామానికి చెందిన గణేష్ జిహెచ్ఎంసి డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసయ్యాడు. శనివారం మధ్యాహ్నం మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవపడి, ఆమెపై దాడి చేసి ఇంట్లో నుంచి రూ.500 తీసుకుని వెళ్లిపోయాడు. సాయంత్రం సుమారు 4:00 గంటల సమయంలో పెద్దగోల్కొండ గ్రామ పరిధిలోని లక్ష్మీ మోనిబాయి వద్ద గణేష్ మద్యం మత్తులో అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం అతని కుమార్తె అర్చన గ్రామస్థుల సహాయంతో ఆటోలో ఇంటికి తీసుకువచ్చింది. తర్వాత గణేష్ ముక్కు, నోటి నుంచి పసుపు రంగు నురుగు రావడంతో పాటు పురుగుల మందు వాసన రావడం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గణేష్ మృతి చెందాడు. మద్యం మత్తులో భార్యతో గొడవ అనంతరం గణేష్ గుర్తుతెలియని పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఓటరు జాబితా సవరణ పరిశీలన

**కోట్‌పల్లి, జులై 12, ప్రభాతవార్త :** సర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తేనె రాంచంద్రారెడ్డి ఆదివారం నాడు కోట్‌పల్లి మండల కేంద్రంలో బార్వాద్, బార్వాద్ తాండ, మోత్కుపల్లి, నాగసాన్‌పల్లి, నాగసాన్‌పల్లి తాండ, కరీంపూర్, రాంపూర్ గ్రామాల్లో బూత్ లెవల్ ఏజెంట్ ప్రత్యేక ఓటర్ జాబితా పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, ప్రజలకు సంబంధించిన సమస్యలు మరియు గ్రామాభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల వలనే విద్యుత్ అంతరాయం

**కొడంగల్, జులై 12, ప్రభాతవార్త:** కొడంగల్‌తో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతున్న కడా డెవలప్‌మెంట్ అభివృద్ధి పనుల కోసమే విద్యుత్ కోతలు విధించడం జరుగుతుందని తప్ప ఎక్కడా అప్రకటిత విద్యుత్ కోతలు విధించడం లేదని విద్యుత్ అధికారులు తెలిపారు. సీఎం ఇలాఖాలో అప్రకటిత విద్యుత్ కోతలు అంటూ ఇటీవలే వార్త దినపత్రికలో రావడంతో విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి స్థానిక విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈమేరకు ఆదివారం స్థానిక విద్యుత్ అధికారులు ఓ ప్రకటలో వివరిస్తు కొడంగల్‌లో ఎలాంటి అప్రకటిత విద్యుత్ కోతలు లేవని తెలిపారు. ఈనెల 5న ఆదివారం కొడంగల్ పట్టణంలో కడా డెవలప్‌మెంట్ పనుల్లో బాగంగా పంచాయతీరాజ్ డెవలప్‌మెంట్ పనులకు గాను 33కేవీ ఫీడర్ ఎల్‌సీ తీసుకొని పనులు చేపట్టడం జరిగిందని వివరించారు. అంతేగాని ఎటువంటి విద్యుత్ కోతలు లేవని పేర్కొన్నారు. కడా డెవలప్‌మెంట్ పనుల కోసం మాత్రమే తక్కువ సమయంలో పని చేస్తున్నట్లు తెలిపారు.

## జవహర్‌నగర్‌లో ముమ్మర తనిఖీలు

**జవహర్‌నగర్, జులై 12. ప్రభాతవార్త :** విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదులు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి రిజిస్ట్రేషన్ కాలనీలో మూడు గంజాయి కేంద్రాలను గుర్తించారు. అదేవిధంగా వాహనాల తనిఖీలు నిర్వహించి మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం సేవించి బహిరంగ ప్రదేశంలో అసభ్యంగా ప్రవర్తించిన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అనంతరం స్థానిక ప్రజలతో సమావేశమై సైబర్ నేరాలు, మైనర్ల వాహనాల డ్రైవింగ్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తప్పులు లేకుండా ఫారాలు నింపండి

**ఘట్‌కేసర్, జులై 12, ప్రభాతవార్త:** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు పంపిణీ చేసిన ధరఖాస్తు ఫారాల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని ఘట్‌కేసర్ తహశీల్దార్ భీమర్తి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే బిఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి అర్హులైన ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారని చెప్పారు. ఓటర్లు ఫారాలను పూర్తిగా స్పష్టంగా ఎలాంటి పొరపాట్లు లేకుండా పూరించి సంబంధిత బిఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు లేదా నియమిత వాలంటీర్లకు ఈనెల 24వ తేదీలోగా తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. గడువు అనంతరం సమర్పించే ఫారాలను స్వీకరించే అవకాశం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఫారాలు నింపడంలో ఏదైనా సందేహాలు, ఇబ్బందులు ఎదురైతే సంబంధిత బిఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, వాలంటీర్ల సహాయం తీసుకోవాలని కోరారు. అవసరమైన చోట ఓటర్లకు మార్గనిర్దేశం చేసి ఫారాలు సక్రమంగా నింపేలా అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ధరఖాస్తులో పేరు, తల్లిదండ్రుల/భర్త పేరు, జన్మతేది, చిరునామా, ఆధార్, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యులు వివరాలు తదితర అంశాలను సరైన ఆధారాలతో నమోదు చేయాలని సూచించారు. తప్పులు, అసంపూర్ణ సమాచారం లేదా సంతకం లేకుండా సమర్పించిన ఫారాల వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తే ఆస్కారముందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు సర్ కార్యక్రమం ఎంతో కీలకమని, ప్రతి ఓటరు ఈప్రక్రియలో భాగస్వామి కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎవరూ కూడా నిర్లక్ష్యంగా చేయకుండా నిర్ణీత గడువులోగా ఫారాలను సమర్పించాలని కోరారు. సర్ ప్రక్రియకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం ఘట్‌కేసర్ తహసీల్ కార్యాలయంలోని అధికారులను సంబంధిత బిఎల్‌ఓలను సంప్రదించాలని తహశీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.

## ఎంఆర్‌పిఎస్ జెండావిష్కరణ

**అడ్డగుట్ట, జులై 12 ప్రభాతవార్త:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ చేపట్టిన ఉద్యమంతోనే ఎస్సీ వర్గీకరణ సాధించుకు న్నామని ఎమ్మార్పీఎస్ సికింద్రాబాద్ ఇన్‌ఛార్జి డప్పు మల్లికార్జున్ మాదిగ, జిల్లా నాయకులు చెండేటి వేణుగోపాల్ మాదిగలు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని అదివారం అడ్డగుట్ట ఆజాద్ చంద్రశేఖర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన ఎమ్మార్పీఎస్ జెండాను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు మాచెర్ల కొండయ్య, జోగు దశరత, భూపతి సుజాత మాదిగ, పరశరాములు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.